
నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 28 అక్టోబర్ 2024 RANGAREDDY



రోటిబండ తండాలో గాయపడిన గిరిజన మహిళా రైతును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

### నానిన పత్తిని కొనాలి..



పత్తికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి. ఇటీవల కురిసిన వానలతో పత్తి నానిపోయింది. ఆ పంటను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. దళారులు క్వింటాల్‌కు రూ.5000 మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రభుత్వం 8 వేల క్వింటాలుకు పత్తిని కొనాలి.

– కట్ట మల్లయ్య మాడ్గుల గ్రామం, మాడ్గుల

### ధర లేక నష్టపోతున్నాం..



పత్తికి ధర లేక చాలా నష్టపోతున్నాం. అప్పులు చేసి పంటను సాగు చేశాం. కానీ, పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం పత్తికి మద్దతు ధరను పెంచి రైతులను ఆదుకోవాలి. గతేడాది 7000–9000 ధర పలికింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో 5000–6000 ఉండడం దురదృష్టకరం. క్వింటాల్ పత్తికి రూ.8000 ధరను ప్రభుత్వం నిర్ణయించాలి.

– భూతరాజు రమేశ్, నల్లచెరువు గ్రామం, మాడ్గుల

# అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..

**రైతుల జోలికి వస్తే.. సహించేది లేదు.**

- కలిసి ఉంటేనే భూములు కాపాడుకోగలం..
- ఫార్మా వస్తే భూములతో పాటు జీవితాలు బుగ్గి..
- సొంత పార్టీ ఎమ్మెల్యేనే ఫార్మాను వ్యతిరేకిస్తుండు..ఆ బుద్ధి సీఎంకు లేదా..?
- ఓటు అడిగేందుకు వచ్చావు..సమస్య తెలుసుకునే బాధ్యత లేదా..?
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- 800 ఎకరాల పట్టా భూములను లాక్కోవడం ఏంటి?.
- లంబాడా హక్కుల పోరా ట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్

కొడంగల్, అక్టోబర్ 27 : అధైర్యపడొద్దని.. ఫార్మా కంపెనీల భూ బాధితులకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం ఆయన దుద్యాల మండలంలోని రోటిబండ తండాలో శుక్రవారం ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో పాల్గొని గాయపడ్డ రైతులను పరామర్శించారు. తండాకు మాజీ ఎమ్మెల్యే రావడంతో గిరిజనులు ఒక్కసారిగా ఆయన్ను హత్తుకుని కంటతడి పెట్టారు. కేసీఆర్ కాలంలో రైతులు ఆనందంగా ఉన్నారని, రేవంత్ పాలనలో అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా భూములను వదులుకొని ఎక్కడికి పోవాలే... ఏం తినాలని కన్నీటిపర్యంతమ య్యారు. ఈ సందర్భంగా తండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఫార్మా భూబాధిత రైతులతో మాట్లాడుతూ.. రైతులంతా కలిసికట్టుగా ఉండి భూములను కాపాడుకోవాలని.. ప్రభుత్వం, అధికారుల ప్రలోభాలకు గురికావొద్దని సూచించారు. ఇక్కడి భూముల్లో ఫార్మా కంపెనీలు ఏర్పాటైతే పరిసరాలు కాలుష్యంగా మారి అందరి జీవితాలు నాశనమవుతాయని, జడ్చర్లలోని అరబిందో ఫార్మా కంపెనీతో ఆ ప్రాంతం కాలుష్యంగా మారి ప్రజలు అల్లాడుతున్నారని గుర్తించిన సొంత పార్టీ జడ్చర్ల ఎమ్మెల్యే అరబిందో ఫార్మా కంపెనీని అక్కడి నుంచి తరిమి కొడతామని పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేకు ఉన్న బుద్ధి సీఎం రేవంత్‌రెడ్డికి ఎందుకు లేదని మండిపడ్డారు. ప్రజల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి.. సీఎం అయిన రేవంత్‌రెడ్డి.. వారి బతుకులను రోడ్డుపాలు చేసేందుకు యత్నిస్తున్నారని మండిపడుతున్నారు. ఎవరొచ్చినా ఫార్మా విలేజ్‌కు సెంటు భూమిని కూడా ఇవ్వొద్దని.. ప్రభుత్వంతో పోరాటానికి రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ నెల 25న జరిగిన ఘటనపై మాజీ మంత్రి కేటీఆర్ చాలా బాధపడ్డారని గుర్తు చేశారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనుకుంటే ఐటీ, టెక్స్‌టైల్ వంటి పెద్ద పరిశ్రమలను ఏర్పాటు చేయొచ్చని.. ప్రజా జీవనానికి హాని కలిగించే, కాలుష్య కారక కంపెనీల ఏర్పాటును అడ్డుకుంటామన్నారు. ఎకరాకు రూ.70 లక్షలు పలికే భూములను నేడు ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం తక్కువ ధరకు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. ఓటు అడిగేందుకు వచ్చిన నీకు.. సమస్య తెలుసుకునే బాధ్యత లేదా..? అని సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు.

### ప్రభుత్వ పథకాలు వద్దు.. భూములే కావాలి..



ప్రభుత్వ పథకాలతో ఎల్లకాలం జీవించలేము. భూములుంటేనే వ్యవసాయం చేసుకుంటూ పిల్లాపాపలతో సంతోషంగా ఉంటాం. అభివృద్ధి పేరిట మా భూములను తీసుకునేందుకు యత్నిస్తే పోరాటం చేస్తాం. సెంటు భూమి కూడా ఇచ్చేది లేదు. మా భూములను లాక్కోవాలని చూస్తే ప్రాణ త్యాగానికి సిద్ధమే.

– సోల్లానాయక్, రోటిబండతండా, దుద్యాల మండలం

### బ్యాంకులో మా పొలాలకు అప్పు ఇవ్వడం లేదు..



ఫార్మా కంపెనీలను తమ భూముల్లో ఏర్పాటు చేస్తున్నారని తెలిసి బ్యాంకులు మా భూములకు అప్పులు ఇవ్వడం లేదు. రేవంత్‌రెడ్డికి ఓట్లేసి గెలిపించడం మేము చేసిన పాపం. ఆరు నెలలుగా తిండి, నిద్రలు మాని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం. ఎప్పుడు ఎవరు వచ్చి మా భూములను ఇవ్వాలని అడుగుతారోననే భయం పట్టుకున్నది. మా భూములను లాక్కొంటే మేము ఎల్లా బతకాలె.

–సుశీలాబాయి, రోటిబండ తండా, దుద్యాల మండలం

### కలెక్టర్ ఆఫీసుకైనా..ఎక్కడికైనా పోయేందుకు సిద్ధమే.



మా ప్రాంతంలో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఎందుకు వచ్చింది. ఇక్కడి ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కాంగ్రెస్ నాయకులు మా రైతులతో ఆడుకుంటున్నారు. ఎవరు వచ్చినా భూమి ఇచ్చేది లేదు.. మా భూములను కాపాడుకునేందుకు కలెక్టర్ ఆఫీసుకే కాదు.. ఎంతవరకైనా పోయేందుకు సిద్ధం. భూములిస్తే మా పిల్లలు ఏ విధంగా బతకాలి. జీవనోపాధి పోతుంటే మా ప్రాణాలు ఉన్నా.. లేకున్నా ఒక్కటే..

–బిక్కీబాయి, రోటిబండతండా, దుద్యాల మండలం

## 800 ఎకరాల పట్టా భూములను లాక్కోవడం ఏంటి?.

**లంబాడా హక్కుల పోరా ట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ రాంబల్‌నాయక్**

కొడంగల్ : ప్రజల జీవనోపాధిని కూల్చేయడమేనా ప్రజాపాలన అని లంబాడా హక్కుల పోరా ట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ రాంబల్‌నాయక్ ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన రోటిబండ తండాలో ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో పాల్గొని గాయపడ్డ రైతులను పరామర్శించి మాట్లాడారు. తండా ల్లో దాదాపుగా 80 ఎకరాలు మాత్రమే ప్రభుత్వ భూమి ఉంటే.. 800 ఎకరాల పట్టా భూములను లాక్కోవడం ఏంటని ప్రశ్నించారు. వ్యవసాయానికి పనికిరాని భూములు, నివాస స్థలాలకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలి కానీ, పచ్చటి పొలాలు, ప్రశాంతంగా జీవిస్తున్న ప్రదేశంలో కాలుష్య కారక కంపెనీలను ఏర్పాటు చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గిరిజనులు అమాయకులు, వారికేం తెలియదు.. వారిని మోసం చేయొచ్చనే భావనలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారని మండిపడ్డారు. గిరిజన బిడ్డల జోలికొస్తే ఏమి జరుగుతుందో ఈ నెల 25న రోటిబండ తండాలో జరిగిన ఘటనే ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. పోలీసులు గిరిజన మహిళలు, చిన్నారులు, వృద్ధులపై లాఠీచార్జి చేయడం అమానుషమన్నారు. సెంటుభూమి, ఇల్లు లేని ఐదుగురు కాంగ్రెస్ నాయకులు, ముగ్గురు అధికారులు కలిసి తీర్మానం చేస్తే ప్రభుత్వానికి భూములను అప్పగించాలా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో గిరిజనులు గోపాల్‌నాయక్, రాజూనాయక్, తండావాసులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ రాంబల్‌నాయక్



### దీపావళి తర్వాతే కొనుగోళ్లు..

జిల్లాలో దీపావళి పండుగ తర్వాతే పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. ఇందుకోసం 14 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. వివిధ జిన్నింగ్ మిల్లులతోపాటు వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో పత్తిని కొంటాం. ప్రస్తుతం తేమ శాతం అధికంగా ఉండటంతో పత్తి కొనుగోళ్లు ప్రారంభించ లేదు.

–మహ్మద్‌రియాజ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక గ్రామాల్లో పత్తిని కొనుగోలు చేసి లారీలో తరలిస్తున్న దళారులు



# పత్తి రైతు ఆగం

*ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి పంటకు గిట్టుబాటు ధర రావడంలేదు. మద్దతు ధర ఇచ్చి కొంటామన్న ప్రభుత్వం.. ఇంకా కొనుగోలు కేంద్రాలనే ఏర్పాటు చేయలేదు. విధిలేని పరిస్థితుల్లో అన్నదాతలు పత్తిని దళారులకు తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. తాను కలలోనూ దళారులకు విక్రయించాల్సిన దుస్థితి వస్తుందని ఊహించలేదని యాచారం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు దూదిమెట్ల ఐలయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. రంగారెడ్డి జిల్లాలో వరి తర్వాత రైతులు పత్తి పంటను సాగు చేస్తారు. మంచాల, యాచారం, మాడ్గుల, తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్, షాద్‌నగర్, ఫరూఖ్‌నగర్, చేవెళ్ల, షాబాద్ మండలాల్లో పత్తిని అత్యధికంగా సాగు చేస్తున్నారు. పంట చేతికొచ్చే సమయంలో గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం చేతులెత్తేయడంతో జిల్లా రైతులు లబోదిబోమంటున్నారు.*

*- ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 27*

### జిల్లాలో లక్షా 26 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు..

జిల్లాలోని రైతులు ఈ వానకాలంలో 1,26,000 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయగా.. 1,15,000 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పెట్టిన పెట్టుబడులు వస్తాయని భావించారు. కానీ, పత్తిని ఏరి ఇండ్లకు తీసుకొస్తున్నా ఇంకా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇండ్లలో పత్తిని నిల్వ చేసుకోలేని రైతులు దళారులకు తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టాలపాలవుతున్నారు. సర్కారు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఉంటే మద్దతు ధర వచ్చి పెట్టిన పెట్టుబడులు వచ్చేవని.. ఇప్పుడు దళారులకు విక్రయించడంతో అప్పులపాలు అవ్వాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### జాడలేని పత్తి కొనుగోలు కేంద్రాలు

- జిల్లాలో 16 పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదనలకే పరిమితం
- నేటికీ అందుబాటులోకి రాక రైతన్నల అవస్థలు
- దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే పత్తి విక్రయం
- అగమ్యగోచరంగా మారిన పత్తి రైతుల పరిస్థితి
- త్వరితగతిన కేంద్రాలను ఏర్పాటు చేయాలంటూ సర్కార్‌కు వేడుకోలు

### జిల్లాలో 16 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు..

జిల్లాలోని రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసేందుకు 16 కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆమనగల్లు పరిధిలో 14 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ మిల్లుల్లో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన రైతులు విక్రయించేందుకు వెసులుబాటు కల్పించనున్నారు. అలాగే ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాలకు చెందిన రైతులకు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సంఘీలో, షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్ ప్రాంతాలకు చెందిన రైతులకు చేవెళ్లలో కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ, ఇప్పటివరకు జిల్లాలో ఏ ఒక్క కేంద్రం కూడా ఏర్పాటు కాకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించక తప్పడం లేదు.



- సమస్యలకు నెలవుగా 'డబుల్' ఇండ్లు
- వసతులు కల్పించాలంటున్న లబ్ధిదారులు
- ప్రజావాణిలోనూ అనేకసార్లు ఫిర్యాదు
- నేడు కమిషనర్‌ను కలవనున్న మురహరిపల్లి వాసులు



# కనీస వసతులేవీ?

సిటీబ్యూరో, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ ): డబుల్ బెడ్రూం ఇండ్లలో మౌలిక వసతుల కల్పనపై బల్దియా మీనమేషాలు లెక్కిస్తున్నది. దీంతో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులకు అవస్థలు తప్పడం లేదు. మౌలిక వసతులు కల్పించాలంటూ..లబ్ధిదారులంతా గడిచిన పది నెలలుగా జీహెచ్‌ఎంసీ ప్రజావాణిలో మొర పెట్టుకుంటూ వస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం దాదాపు 66వేలకు పైగా లబ్ధిదారులకు ఇండ్ల పంపిణీ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు దాటినా.. ఆ ఇండ్ల సముదాయాల్లో మౌలిక వసతులు కల్పించలేదని లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఇండ్లలో లిఫ్టులు పనిచేయడం లేదని వాపోతున్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడుతున్నదని, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని డబుల్ ఇండ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ.. లబ్ధిదారులు ఇందిరా పార్కు, జోనల్ కార్యాలయాల ఎదుట ఆందోళన సైతం చేపట్టారు. స్పందించిన అప్పటి కమిషనర్ ఆమ్రపాలి మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే నీటి సరఫరా, డ్రైనేజీ, లిఫ్టులు, కరెంట్, రహదారులు, ఇతర సదుపాయాల పనులకు టెండర్లు పిలుస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప.. ఆచరణలో మాత్రం పనులు జరుగుతున్న దాఖలాలు లేవని లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగే ప్రజావాణికి లబ్ధిదారులు పెద్ద ఎత్తున వచ్చి కమిషనర్ ఇలంబర్తి ముందు తమ ఆవేదన, నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు. శామీర్‌పేట వద్ద మురహరపల్లి 2 బీహెచ్‌కే లబ్ధిదారులు కమిషనర్‌ను కలవనున్నారు.

**రూ.100 కోట్ల నిధులపై రాని స్పష్టత?**

నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్న సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం 111 లొకేషన్లలో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్ల పథకాన్ని చేపట్టింది. ఇందులో భాగంగానే ఉన్న చోటే 27 ప్రాంతాల్లో (ఇన్‌సైట్)లో 5,363 మందికి, 39 లొకేషన్లలో 63,478 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లను అందజేసిన సంగతి తెలిసిందే. అలాగే 66 లొకేషన్లలో మొత్తం 68,841 మందికి పట్టాలు అందజేశారు. కార్పొరేట్ స్థాయిలో ఈ ప్రాజెక్టులో మౌలిక సదుపాయాల కల్పన జరిగింది. కొన్ని చోట్ల కరెంట్ కనెక్షన్, కేబుల్ నెట్‌వర్క్, ఇంటర్‌నెట్, ఇతర మెయింటెనెన్స్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా కేసీఆర్ సర్కారు హెచ్‌ఎండీఏ నుంచి రూ. 100 కోట్లను జీహెచ్‌ఎంసీకి బదలాయించింది. నిబంధనల ప్రకారమే జీహెచ్‌ఎంసీ ఖజానాలోకి రూ.100 కోట్లు వచ్చి చేరాయి. కానీ నేటికి ఈ నిధులు ఖజానా నుంచి నిర్వహణకు మళ్లలేదు. పైగా డ్రైనేజీ, నల్లా కనెక్షన్ వేసిన జలమండలికి నిధులు మంజూరు చేయలేదు. డబుల్ బెడ్రూం ఇండ్లకు తాజా బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదు. అయితే రూ. 100కోట్ల నిధులను ఎలా సమకూర్చుకొని మౌలిక వసతుల కల్పనకు ఎలా కృషి చేస్తారన్నది స్పష్టత లేదు. మొత్తంగా మరిన్ని నెలలు లబ్ధిదారులు ఇబ్బందులు పడక తప్పని పరిస్థితి నెలకొన్నది.

# కొండంతా సండే సందడి



వికారాబాద్, అక్టోబర్ 27 : వికారాబాద్ పట్టణానికి సమీపంలో ఉన్న అనంతగిరి కొండల్లో అనంతపద్మనాభస్వామిని ఆదివారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు. సెలవు దినం కావడంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. అనంతగిరిలోని పచ్చని కొండలు, స్వచ్ఛమైన ప్రకృతిని ఆస్వాదించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు వంటకాలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. వాచ్ టవర్ వద్ద పర్యాటకులు సందడి చేశారు. వ్యూ పాయింట్, నంది ఘాట్ తదితర ప్రదేశాల్లో పర్యాటకులు ఫొటోలు, సెల్ఫీలు దిగారు. పర్యాటకుల కోసం అటవీ శాఖ వాహనాన్ని ఏర్పాటు చేసింది. ఈ వాహనం.. 8 మంది పర్యాటకులను అటవీ ప్రాంతంలో చూడదగ్గ ప్రదేశాలను చూపించుకొని తిరిగి తీసుకొస్తుంది. ఒక్కొక్కరికీ రూ.200 టికెట్ పెట్టారు.

**అనంతగిరికి పర్యాటకుల తాకిడి**

**కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి**

## బోటు షికారు..

ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవు దినం కావడంతో స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ప్రాజెక్టులో బోటింగ్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు. సిబ్బంది పర్యాటకులకు రక్షణగా దుస్తులను అందజేసి బోటింగ్‌కు అనుమతించారు. ప్రాజెక్టు అందాలను తిలకిస్తూ సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ ఆనందంలో మునిగితేలారు. కుటుంబ సమేతంగా వచ్చినవారు వనభోజనాలు చేస్తూ సందడి చేశారు. ప్రాజెక్టు ప్రాంతమంతా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

– ధారూరు, అక్టోబర్ 27

